సాక్షి
రాజన్న సిరిసిల్ల

హంస వాహనంపై విహరింపు

వేములవాడ: రాజన్న ఆలయంలో నిర్వహిస్తున్న శ్రీదేవీ నవరాత్రోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి స్వామి వారి ఉత్సవమూర్తులను పురవీధుల్లో హంస వాహనంపై ఊరేగించారు. దారిపొడవున మహిళలు మంగళహారతులు ఇచ్చి స్వాగతం పలికారు. ఆలయ అధికారులు, పురప్రముఖులు, భక్తులు పాల్గొన్నారు.



సోమవారం। 16। అక్టోబర్। 2023

న్యూస్‌రీల్

ప్రజావాణి రద్దు

సిరిసిల్లటౌన్: రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణిని రద్దు చేసినట్లు కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదివారం ప్రకటనలో తెలిపారు. ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు ప్రజావాణి కొనసాగదని పేర్కొన్నారు. ఈవిషయాన్ని జిల్లా ప్రజలు గమనించి అధికార యంత్రాంగానికి సహకరించాలని కోరారు.

రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించాలి



మాట్లాడుతున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): సిరిసిల్లలో ఈనెల 17న నిర్వహించే ప్రజా ఆశీర్వాద సభలో సీఎం కేసీఆర్ ఎల్లారెడ్డిపేటను రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించాలని డివిజన్ సాధన కమిటీ అధ్యక్షుడు ఒగ్గు బాల్‌రాజ్‌యాదవ్ డిమాండ్ చేశారు. అఖిలపక్షం నాయకులతో కలిసి ఆదివారం ఎల్లారెడ్డిపేటలో మాట్లాడారు. గంభీరావుపేట, ముస్తాబాద్, వీర్నపల్లి, ఎల్లారెడ్డిపేట నాలుగు మండలాలను కలిపి రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించాలని కోరారు. మండలానికో కంపెనీ ఏర్పాటు చేసి నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలని కోరారు. డివిజన్ సాధన కమిటీ సభ్యులు దొమ్మాటి నర్సయ్య, సద్ది లక్ష్మారెడ్డి, గుండాడి వెంకట్‌రెడ్డి, పరుమాల మల్లేశం, బట్టు పీర్యానాయక్, రాజబాబు పాల్గొన్నారు.

'వర్కర్ టు ఓనర్ ఆలస్యమెందుకో ?'



మాట్లాడుతున్న కోడం రమణ

సిరిసిల్లటౌన్: నేతకార్మికులను యజమానులు చేసే పథకం అమలులో జాప్యంపై సీఎం కేసీఆర్ సమాధానం చెప్పాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కోడం రమణ డిమాండ్ చేశారు. సిరిసిల్లలోని బీవైనగర్‌లో ఆదివారం నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో మాట్లాడారు. పెద్దూరు శివారులో 2018 నవంబర్‌లో సీఎం 88 ఎకరాలలో షెడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారని గుర్తు చేశారు. బీఆర్ఎస్ పార్టీ ఆఫీసులపై ఉన్న శ్రద్ధ నేతకార్మికులపై లేదని విమర్శించారు. ఈనెల 17న సిరిసిల్లకు వస్తున్న సీఎం కేసీఆర్ ఈ విషయమై స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. ఎలిగేటి రాజశేఖర్, బెజుగం సురేశ్, మోర తిరుపతి, బింగి సంపత్ పాల్గొన్నారు.

ఐఎంఏ జిల్లా అధ్యక్షుడిగా గూడూరి రవీందర్




గూడూరి రవీందర్ అధ్యక్షుడు



కోడం విక్రమ్ ప్రధాన కార్యదర్శి

సిరిసిల్ల: ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ) జిల్లా అధ్యక్షుడిగా డాక్టర్ గూడూరి రవీందర్, ప్రధాన కార్యదర్శిగా కోడం విక్రమ్ ఎన్నికయ్యారు. స్థానికంగా ఆదివారం నిర్వహించిన సమావేశంలో 2023–2024 సంవత్సరానికి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా పి.యాదగిరిగౌడ్, కె.రాజేందర్, కోశాధికారిగా తిరుపతి, సంయుక్త కార్యదర్శులుగా పి.అరుణ, కె.మురళీకృష్ణ, ఎ.సంతోష్‌చారిలను ఎన్నుకున్నారు. రాష్ట్ర కౌన్సిల్ సభ్యులను, సెంట్రల్ కౌన్సిల్ సభ్యులను ఎంపిక చేశారు.

జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీలు



సిరిసిల్లఅర్బన్: రాజీవ్‌నగర్‌లోని మినీస్టేడియంలో జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి 9వ తెలంగాణ స్టేట్ జూనియర్ అథ్లెటిక్ చాంపియన్‌షిప్ ఎంపిక పోటీలు ఆదివారం నిర్వహించారు. అండర్–14, 16, 18, 20 విభాగాల్లో పోటీలు నిర్వహించారు. 30 మంది క్రీడాకారులు ఎంపికయ్యారు. వీరు ఈనెల 25న సూర్యాపేటలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొననున్నారు. జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, పీఈటీలు సాయికృష్ణ, అజయ్‌కుమార్, బాబు, శ్రీని వాస్, కోశాధికారి వినోద్ కుమార్, రవి, మహిపాల్ ఉన్నారు.

ఏడుగురితో హస్తం తొలి జాబితా



తాటిపర్తి జీవన్‌రెడ్డి - జగిత్యాల

పుట్టినతేదీ : 05-01-1951
విద్యార్హతలు : బీఏ, ఎల్ఎల్‌బీ (ఉస్మానియా)
సామాజిక వర్గం: రెడ్డి
స్వగ్రామం: బతికపెల్లి, పెగడపల్లి మండలం, జగిత్యాల
అనుభవం: ఆరుసార్లు ఎమ్మెల్యే, రెండుసార్లు మంత్రి, ప్రస్తుతం ఎమ్మెల్సీ

రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్-రామగుండం



పుట్టినతేదీ : 15-08-1972
విద్యార్హతలు : బీఏ
సామాజిక వర్గం : బీసీ, బుందేలా
స్వగ్రామం : రామగుండం, గోదావరిఖని
అనుభవం : శాప్ చైర్మన్, 2014, 2108లో రామగుండం నుంచి ఎమ్మెల్యేగా పోటీ.

దుద్దిళ్ల శ్రీధర్‌బాబు - మంథని



పుట్టినతేదీ : 30 మే 1969
విద్యార్హతలు : ఎంఏ, ఎల్ఎల్‌బీ
సామాజిక వర్గం : బ్రాహ్మణ
స్వగ్రామం : ధన్వాడ, కాటారం మండలం
అనుభవం : మంత్రి, నాలుగుసార్లు ఎమ్మెల్యే

చింతకుంట విజయరమణారావు-పెద్దపల్లి



పుట్టినతేదీ : 08-11-1966
విద్యార్హతలు : ఇంటర్
సామాజిక వర్గం : వెలమ
స్వగ్రామం : శివపల్లి, ఎలిగేడు
అనుభవం: 2001లో జెడ్పీటీసీ,2009లో ఎమ్మెల్యే

ఆది శ్రీనివాస్ - వేములవాడ



పుట్టినతేదీ : 15-09-1966
విద్యార్హతలు : ఐటీఐ
సామాజికవర్గం : బీసీ, మున్నూరు కాపు
స్వగ్రామం : రుద్రంగి
అనుభవం : 2009, 2010, 2014, 2018 ఎన్నికల్లో పోటీ,
ప్రస్తుతం : టీపీసీసీ కార్యదర్శి,వేములవాడ ఇన్‌ఛార్జి

అడ్లూరి లక్ష్మణ్‌కుమార్-ధర్మపురి



పుట్టినతేదీ : 01-04-1968
విద్యార్హతలు : ఇంటర్, ఐటీఐ
సామాజిక వర్గం : ఎస్సీ (మాదిగ)
స్వగ్రామం : గోదావరిఖని
అనుభవం : జెడ్పీ చైర్మన్, ఎస్సీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్, 2014, 2018లో ధర్మపురి నుంచి ఎమ్మెల్యేగా పోటీ..

కవ్వంపల్లి సత్యనారాయణ - మానకొండూర్

పుట్టినతేదీ : 10-06-1967
విద్యార్హతలు : ఎంబీబీఎస్ జనరల్ సర్జన్
సామాజికవర్గం : ఎస్సీ (మాదిగ)
స్వగ్రామం : కరీంనగర్
అనుభవం : 2009లో, 2014లో ఎమ్మెల్యేగా పోటీ

- పెద్దపల్లిలోని మూడు నియోజకవర్గాలకూ అభ్యర్థుల వెల్లడి
- ఉమ్మడి జిల్లాలో మరో ఆరు స్థానాలకు త్వరలో ప్రకటన
- ఆరు పథకాలే ఆయుధాలంటున్న కాంగ్రెస్ నేతలు
- 19న పెద్దపల్లి, కరీంనగర్‌లో రాహుల్ పర్యటన
- ఎన్టీపీసీ, సింగరేణి కార్మికులు, ఆర్ఎఫ్‌సీఎల్ బాధితులతో సమావేశం
- రాహుల్ యాత్రతో కొత్త జోష్ వస్తుందంటున్న నేతలు

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: రానున్న అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి కాంగ్రెస్ తొలిజాబితా విడుదలైంది. ఏడుగురు అభ్యర్థులతో తొలి జాబితా ప్రకటించిన కాంగ్రెస్ పార్టీ.. మిగిలిన ఆరుస్థానాలకు త్వరలోనే రెండోజాబితాలో అభ్యర్థులను ప్రకటించనుంది. వాస్తవానికి ‘కారు’ పార్టీతో పోల్చితే ‘హస్తం’ పార్టీ అభ్యర్థుల ఎంపికలో జాప్యం చేసింది. ఇవేమీ ఎన్నికలపై ప్రభావం చూపబోవని, ఆలస్యంగా వచ్చినా సరే తాము ప్రచార కదనరంగంలో కొదమసింహాల్లో దూకుతామని కాంగ్రెస్ అభ్యర్థులు ధీమాగా ఉన్నారు. తొలిజాబితా అనుకూల పవనాలు ఉన్నచోట అధికార బీఆర్ఎస్‌ను ధీటుగా ఎదుర్కోగలిగిన అభ్యర్థులు ఉన్న స్థానాలు కావడం గమనార్హం.

ఈ స్థానాలకు అభ్యర్థులు..

ఉమ్మడి జిల్లాలోని పెద్దపల్లి జిల్లాపైనే కాంగ్రెస్ పార్టీ బాగా ఆశలు పెట్టుకుంది. ఉమ్మడి జిల్లాలోని 13 అసెంబ్లీ స్థానాల్లో మంథనిలో ఒకేచోట తమ ఎమ్మెల్యే ప్రాతినిధ్యం వహిస్తుండటం.. ఇక్కడే పార్టీకి పట్టు ఉండటంతో ముందుగా ఆ జిల్లాలోని మూడుస్థానాలకు అభ్యర్థులను ప్రకటించింది. ఆ తరువాత జగిత్యాల జిల్లాలోని ధర్మపురి, జగిత్యాలకు అభ్యర్థులను ప్రకటించిన హస్తం పార్టీ.. కోరుట్లను తరువాత జాబితాకు మార్చింది. రాజన్నసిరిసిల్లజిల్లాలోని రెండు నియోజకవర్గాల్లో వేములవాడకు అభ్యర్థిని ప్రకటించి.. సిరిసిల్లకు ఆపింది. కీలకమైన కరీంనగర్‌లో ఒక్క మానకొండూరుకు అభ్యర్థిని ప్రకటించి.. మిగిలిన చొప్పదండి, హుజూరాబాద్, హుస్నాబాద్, కరీంనగర్ స్థానాల ప్రకటన వాయిదా వేసింది. ప్రస్తుత జాబితాలోని అభ్యర్థుల్లో ముగ్గురు ఓసీ (వెలమ, బ్రాహ్మణ, రెడ్డి) సామాజికవర్గాలకు చెందిన వారు కాగా.. ఇద్దరు బీసీ (బుందెల, మున్నూరు కాపు), మరో ఇద్దరు ఎస్సీ (మాదిగ) సామాజికవర్గాలకు చెందిన వారు.

ఆరుపథకాలపై విశ్వాసం

కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు పథకాలు తమను అధికారంలోకి తీసుకొస్తాయని హస్తం పార్టీ నేతలు బలంగా నమ్ముతున్నారు.

- మహాలక్ష్మీ పథకంలో భాగంగా ప్రతి మహిళకూ నెలకు రూ.2,500 ఆర్థిక సాయం.
- రూ.500కే గ్యాస్ సిలిండర్, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం.
- రైతు భరోసా కింద ఏటా రైతులు, కౌలు రైతులకు ఎకరాకు రూ.15,000 పెట్టుబడి సాయం, వ్యవసాయ కూలీలకు రూ.12,000 ఆర్థిక సాయం.
- వరి పంటకు అదనంగా రూ.500 బోనస్.
- గృహజ్యోతి కింద 200 యూనిట్ల వరకు కరెంట్ ఉచితం.
- ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద ఇళ్లు లేని పేదలకు ఇంటి స్థలం, ఇంటి నిర్మాణానికి రూ.5లక్షల సాయం.
- యువ వికాసం కింద విద్యా భరోసా కార్డు ద్వారా విద్యార్థులకు రూ.5 లక్షల పరిమితితో వడ్డీరహిత ఆర్థిక సాయం, ప్రతి మండలంలో తెలంగాణ ఇంటర్నేషనల్ స్కూళ్ల ఏర్పాటు.
- చేయూత కింద పింఛనుదారులకు నెలకు రూ.4,000 పింఛను, ఆరోగ్య శ్రీ కింద రూ.10 లక్షల బీమా.

19న పెద్దపల్లి, కరీంనగర్ జిల్లాలో రాహుల్ పర్యటన

ఈనెల 19న కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ పెద్దపల్లి, కరీంనగర్ జిల్లాల్లో పర్యటించనున్నారు. 18న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు సింగరేణి, ఎన్టీపీసీ ఉద్యోగులు, యూనియన్ లీడర్లు, ఆర్ఎఫ్‌సీఎల్ కార్మికులు, కాంట్రాక్ట్ ఉద్యోగాల బాధితులతో సమావేశం అవుతారు. సాయంత్రం 4 గంటల నుంచి 6 గంటల వరకు పెద్దపల్లిలో బహిరంగసభలో మాట్లాడతారు. రైస్‌మిల్లర్ల అసోసియేషన్, రైతులతో సమావేశమవుతారు. రాత్రి 7 నుంచి 8 గంటల వరకు పెద్దపల్లి నుంచి కరీంనగర్ వరకు పాదయాత్ర ద్వారా చేరుకుంటారు. రాహుల్ పాదయాత్ర ద్వారా ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవం వస్తుందని సీనియర్ నేతలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ఆరు గ్యారంటీలు.. పార్టీ సహకారంతో గెలుస్తా

కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీలు, పార్టీ ఇచ్చిన సహకారం, కార్యకర్తల కృషి, స్థానికత ఆధారంగా నేను ఈ ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిచేందుకు దోహదపడుతుంది. ఈరోజు మొదటి జాబితాలో నా పేరు ఖరారు చేయడంపై పార్టీ అధిష్ఠానానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. నాలుగు సార్లు ఓటమి చెందినప్పటికీ జనమే నా బలంగా నమ్ముకుని జనంతోనే ఉన్నాను. ఈ ఎన్నికల్లో తప్పకుండా ప్రజలు నన్ను గెలిపిస్తారన్న విశ్వాసం ఉంది. లోకల్‌గా ఉంటూ ప్రజలకు సేవలందించడమే నా కర్తవ్యం.

–ఆది శ్రీనివాస్, డీసీసీ అధ్యక్షుడు

తొలిరోజు ఐదుగురికి బీ-ఫామ్స్

- సీఎం చేతులమీదుగా తీసుకున్న బీఆర్ఎస్ అభ్యర్థులు
- హైదరాబాద్‌లో అందుకున్న మంత్రి కేటీఆర్
- హుస్నాబాద్ బహిరంగ సభలోనే సతీశ్‌బాబుకు..
- మానకొండూర్ ఎమ్మెల్యే రసమయికి, పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరికి బీ-ఫామ్స్

సాక్షిప్రతినిధి, కరీంనగర్: ఉమ్మడి జిల్లా పరిధిలోని 13 అసెంబ్లీ నియోజకవర్గాలకుగాను తొలిరోజు (ఆదివారం) నలుగురు అభ్యర్థులకు పార్టీ బీ-ఫామ్‌లను సీఎం కేసీఆర్ హైదరాబాద్‌లోని తెలంగాణభవన్‌లో అందించగా, సతీశ్‌బాబుకు హుస్నాబాద్‌లో ఇచ్చారు. హైదరాబాద్‌లో అందుకున్నవారిలో రాష్ట్ర ఐటీ, పురపాలకశాఖ మంత్రి కేటీఆర్, మానకొండూరు ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి, హుజూరాబాద్ ఎమ్మెల్యే అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డి ఉన్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలోని హుస్నాబాద్ నియోజకవర్గ కేంద్రంలో జరిగిన ప్రజాఆశీర్వాద సభకు హాజరైన సీఎం కేసీఆర్.. ఆ నియోజకవర్గ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌బాబుకు సభావేదికపైనే బీ-ఫామ్ అందించారు. ఉమ్మడి జిల్లా పరిధిలోని మిగతా అభ్యర్థులకు సోమవారం తెలంగాణభవన్‌లో సీఎం కేసీఆర్ చేతుల మీదుగా అందించనున్నట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి.



ఎమ్మెల్యే రసమయికి బీఫాం ఇస్తున్న సీఎం కేసీఆర్

నేడు బీఆర్ఎస్ కార్యాలయం ప్రారంభం

- ప్రారంభించనున్న బీఆర్ఎస్ జనరల్ ప్రధాన కార్యదర్శి కే.కేశవరావు
- ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు, మంత్రులు హాజరు

సిరిసిల్లటౌన్: జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యాలయం ప్రారంభోత్సవానికి జిల్లాకు మంత్రులు వస్తున్నారు. సోమవారం ఉదయం 11 గంటలకు బీఆర్ఎస్ కార్యాలయాన్ని పార్టీ ప్రధాన కార్యదర్శి కే.కేశవరావు చేతుల మీదుగా ప్రారంభించనున్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే.తారకరామారావు, రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్, సాంఘిక సంక్షేమశాఖ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్, పౌరసరఫరాలశాఖ మంత్రి గంగుల కమలాకర్, ఎమ్మెల్యేలు చెన్నమనేని రమేశ్‌బాబు, సుంకె రవిశంకర్, రసమయి బాలకిషన్, బీఆర్ఎస్ వేములవాడ అభ్యర్థి చల్మెడ లక్ష్మీనర్సింహారావు పాల్గొంటారు.



సిరిసిల్లలో సిద్ధమైన బీఆర్ఎస్ కార్యాలయం

జిల్లాలో రెండో పార్టీ కార్యాలయం

పాత తాలూకా నుంచి జిల్లాగా ఏర్పడిన సిరిసిల్లలో బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం రెండోదిగా చరిత్రలోకి ఎక్కుతుంది. ఇప్పటి వరకు సిరిసిల్లలో సీపీఐ పార్టీకి మాత్రమే సొంత పార్టీ భవనం ఉండగా.. ప్రస్తుతం బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం సొంత భవనంతో సిద్ధమైంది. పాత తాలూకాగా ఉన్న సిరిసిలలో కార్మికభవనం(సీపీఐ) కార్యాలయాన్ని 26 నవంబర్ 1993న అప్పటి పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చెన్నమనేని రాజేశ్వర్‌రావు శంకుస్థాపన చేశారు. 22 జూన్ 1997లో అప్పటి సీపీఐ కార్యదర్శి దాసరి నాగభూషణరావు ప్రారంభించారు. కాగా సిరిసిల్ల జిల్లాగా ఏర్పడిన తర్వాత తొలి జిల్లా పార్టీ ప్రధాన కార్యాలయం భవనం ఏర్పాటు బీఆర్ఎస్‌దే అవడం విశేషం. పార్టీ ఆఫీస్ ప్రారంభోత్సవం సందర్భంగా బీఆర్ఎస్ శ్రేణుల్లో ఉత్సాహం పెరిగింది.

ఇంటింటికి తిరగండి

- ఆరు గ్యారంటీలపై ప్రచారం చేయండి
- ఏఐసీసీ సెక్రటరీ క్రిష్టోఫర్ తిలక్
- 45 రోజులు శ్రమించండి : ఆది శ్రీనివాస్

వేములవాడ: నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి గెలిచే అవకాశాలు మెండుగా ఉన్నాయని, ఇంటింటికీ తిరిగి ఆరు గ్యారంటీలపై విస్తృతంగా ప్రచారం చేయాలని ఏఐసీసీ జనరల్ సెక్రటరీ క్రిష్టోఫర్ తిలక్ కోరారు. పట్టణంలోని హరిమళ్ల గార్డెన్‌లో ఆదివారం నిర్వహించిన వేములవాడ రూరల్, అర్బన్ మండలాల కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. సిరిసిల్ల, సిద్దిపేట రోడ్ల తప్ప మరెక్కడా బాగుపడలేదన్నారు. వేములవాడ అభివృద్ధిలో వెనకబడిందన్నారు. ఎమ్మెల్యేగా పనిచేసిన వ్యక్తి జర్మనీకే పరిమితమయ్యారని విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించాలని, కార్యకర్తలు కష్టపడితేనే అధికారంలోకి వస్తామన్నారు. తెలంగాణలో ప్రభుత్వాన్ని మార్చాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. వేములవాడటౌన్, అర్బన్, రూరల్ మండలాల్లో 73 వేల ఓట్లు ఉన్నాయని.. కార్యకర్తలు కష్టపడితేనే మనం ఎక్కువ ఓట్లు సాధించుకోగలుగుతామన్నారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రణాళికతో ముందుకెళ్తే విజయం సాధ్యమన్నారు. రానున్న 45 రోజులు అత్యంత కీలకమని, బూత్ లెవల్‌లో టీమ్‌గా పనిచేయాలని కోరారు. పార్టీ పట్టణ, అర్బన్ అధ్యక్షులు చంద్రగిరి శ్రీనివాస్‌గౌడ్, వకుళాభరణం శ్రీనివాస్, పిల్లి కనకయ్య, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సాగరం వెంకటస్వామి, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న క్రిష్టోఫర్ తిలక్

అక్రమాలకు కేరాఫ్ చొప్పదండి ఎమ్మెల్యే

- నాలుగేళ్లలో వందల కోట్ల అక్రమ సంపాదన
- కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి మేడిపల్లి సత్యం

బోయినపల్లి(చొప్పదండి): అవినీతి, అక్రమాలకు కేరాఫ్‌గా చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ మారారని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి మేడిపల్లి సత్యం విమర్శించారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయాన్ని ఆదివారం ప్రారంభించారు. బోయినపల్లికి చెందిన నాయకులు నల్ల మోహన్‌తోపాటు రామన్నపేట, బూర్గుపల్లి, మాన్వాడ, మల్కాపూర్, అనంతపల్లి గ్రామాల నుంచి పలువురు కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా మేడిపల్లి సత్యం మాట్లాడుతూ గెలిచిన నాలుగేళ్లలోనే వందల కోట్లు అక్రమంగా సంపాదించి రాష్ట్రంలో నంబర్ వన్ అవినీతి ఎమ్మెల్యేగా పేరు పొందారన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీ పథకాలు అమలు చేసి అన్ని వర్గాల ప్రజలకు మేలు చేస్తుందని తెలిపారు. కాంగ్రెస్ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు కూస రవీందర్, మండలాధ్యక్షుడు వన్నెల రమణారెడ్డి, పులి లక్ష్మీపతి, బోయిని ఎల్లేశ్, ఏనుగుల కనకయ్య, కట్ట లచ్చయ్య, భీంరెడ్డి మహేశ్‌రెడ్డి, ఎంపీటీసీ ఉయ్యాల శ్రీనివాస్, పిట్టల మోహన్, పొన్నం మధు, దూస రామస్వామి, కొడగాని వెంకటేశ్, నాగుల వంశీ, ఏనుగుల ప్రశాంత్, అజయ్, బాబు, శ్రీకాంత్, జలంధర్, నజీర్, మహేందర్, మహేశ్ ఉన్నారు.



పార్టీ కండువా కప్పుతున్న మేడిపల్లి సత్యం

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ

వేములవాడ: వేములవాడ అసెంబ్లీ స్థానాన్ని బీజేపీ కైవసం చేసుకునేందుకు బూత్ కమిటీలు పటిష్టంగా పనిచేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ కోరారు. స్థానిక భీమేశ్వరగార్డెన్‌లో ఆదివారం అసెంబ్లీ పరిధిలోని 256 బూత్ కమిటీ అధ్యక్షులతో సమావేశం నిర్వహించారు. గెలిచేందుకు తీసుకోవాల్సిన చర్యలపై దిశ నిర్దేశం చేశారు. జిల్లా ఇన్‌చార్జి గంగాడి మోహన్‌రెడ్డి, పార్లమెంట్ ఇన్‌చార్జి, ప్రభారి పల్లె గంగారెడ్డి, అసెంబ్లీ ప్రభారీ బాలాగౌడ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎర్రం మహేశ్, చెన్నమనేని వికాస్‌రావు, తుల ఉమ, అసెంబ్లీ కన్వీనర్ మార్త సత్తయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి రేగుల మల్లికార్జున్, ఏడు మండలాల అధ్యక్షులు, బూత్ కమిటీల అధ్యక్షులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రతాప రామకృష్ణ

కేటీఆర్‌కే మా మద్దతు

- మ్యాక్స్ సంఘాలు..
- టెక్స్‌టైల్ పార్కు యజమానుల తీర్మానం

సిరిసిల్లటౌన్: మంత్రి కేటీఆర్‌కు మద్దతు ఇస్తున్నట్లు సిరిసిల్ల పవర్‌లూం మ్యాక్స్ సంఘాల అసోసియేషన్ ప్రకటించింది. సిరిసిల్లలో ఆదివారం జరిగిన సమావేశంలో వక్తలు మాట్లాడారు. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ ఆర్థిక సంక్షోభంలో ఉన్నప్పుడు తెలంగాణ ప్రభుత్వం నుంచి అనేక సంక్షేమ ఫలాలు అందించిన మంత్రి కేటీఆర్ గెలుపునకు మ్యాక్స్ సంఘాలు, ఎస్ఎస్ఐ యూనిట్ల సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. సిరిసిల్ల పవర్‌లూమ్ మ్యాక్స్ సంఘాల అసోసియేషన్ అధ్యక్షుడు ఎల్లండి శంకర్, ప్రధాన కార్యదర్శి పోలు శంకర్, గంగుల శ్రీనివాస్, నల్ల దక్షిణమూర్తి, జిందం ఆంజనేయులు పాల్గొన్నారు.

తంగళ్లపల్లి(సిరిసిల్ల): మండలంలోని బద్దెనపల్లి–సారంపల్లి టెక్స్‌టైల్ పార్కు క్లాత్ మ్యానుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ మంత్రి కేటీఆర్‌కు మద్దతు ప్రకటించారు. ఈమేరకు ఆదివారం టెక్స్‌టైల్ పార్కు అధ్యక్షుడు అన్నల్‌దాస్ అనిల్‌కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఈమేరకు ఏకగ్రీవ తీర్మానం చేశారు. అనిల్‌కుమార్ మాట్లాడుతూ సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌ల ప్రత్యేక చొరవతో టెక్స్‌టైల్స్ పరిశ్రమ మనుగడ సాగిస్తోందని తెలిపారు. 17న జరుగబోయే ప్రజా ఆశీర్వాద సభకు పవర్‌లూమ్ కార్మికులు, పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికులు పెద్దసంఖ్యలో హాజరుకావాలని పిలుపునిచ్చారు. యజమానులు యెల్లె లక్ష్మీనారాయణ, కళ్యాడపు సుభాశ్, గాజుల రాజేశం, వాసం శ్రీనివాస్, బొద్దుల సుదర్శన్, దుబాల మొండయ్య, యెముల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అనిల్‌కుమార్

కేటీఆర్ నామినేషన్ ఖర్చు భరిస్తాం

తంగళ్లపల్లి(సిరిసిల్ల): మండల కేంద్రానికి చెందిన ఒడ్డెర కులస్తులు ఆదివారం స్థానిక ఇంపీరియల్ గార్డెన్‌లో సమావేశం నిర్వహించారు. రాబోవు అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి కేటీఆర్‌కు తమ మద్దతు ప్రకటించారు. అంతేకాకుండా కేటీఆర్ ఎమ్మెల్యే అభ్యర్థిగా నామినేషన్ వేసేందుకు స్థానిక బీఆర్ఎస్ నాయకులకు రూ.10,116 అందించి తమ అభిమానాన్ని చాటుకున్నారు. కేటీఆర్‌తోనే ఈ ప్రాంత అభివృద్ధి సాధ్యమన్నారు. ఒడ్డెరసంఘం అధ్యక్షుడు దేవయ్య, నాయకులు బొల్లి రామ్మోహన్, ఎంపీపీ పడిగెల మానస, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రాజన్న, ఎంపీటీసీ కోడి అంతయ్య, సింగిల్‌విండో వైస్‌చైర్మన్ వెంకట రమణారెడ్డి, పడిగెల రాజు, సద్ద రోజా, కోడం సంధ్యారాణి పాల్గొన్నారు.



కేటీఆర్‌కు మద్దతు ప్రకటిస్తున్న ఒడ్డెర కులస్తులు

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి

సిరిసిల్లఅర్బన్: కాంగ్రెస్‌తోనే అన్నివర్గాల అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి మహేందర్‌రెడ్డి పేర్కొన్నారు. సిరిసిల్ల మున్సిపల్ పరిధి చిన్నబోనాలలో ఇంటింటికి తిరుగుతూ కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీ పథకాలపై ప్రచారం చేశారు. అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేస్తుందన్నారు. పార్టీ పట్టణాధ్యక్షుడు ప్రకాశ్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు బాలరాజు, మాజీ కౌన్సిలర్ లక్ష్మీనారాయణ ఉన్నారు.



గ్రామస్తులతో మాట్లాడుతున్న మహేందర్‌రెడ్డి

క్లుప్తంగా

22 ఏళ్లకు గుర్తుంచుకొని...

- స్నేహితుల ఔదార్యం
- అన్నావదినలే ఆధారం



పద్మకు ఆర్థిక సహాయం చేస్తున్న పదో తరగతి స్నేహితులు

వేములవాడరూరల్: చిన్నప్పుడు తమతో కలిసి చదువుకున్న స్నేహితురాలికి కష్టకాలం వచ్చిందని తెలుసుకున్న ఆనాటి స్నేహితులు ఆర్థిక సహాయం చేసి అండగా నిలిచారు. వేములవాడరూరల్ మండలంలోని హన్మాజిపేట జెడ్పీహెచ్ఎస్‌లో 2001–02 సంవత్సరంలో పదోతరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు తోటి స్నేహితురాలికి కష్టకాలంలో రూ.40 వేలు అందజేశారు. లింగంపల్లికి చెందిన బూర్ల పద్మ భర్త కరోనా సమయంలో మృతిచెందాడు. తండ్రి గతంలో చనిపోగా తల్లి మూడు నెలల క్రితం మృతి చెందింది. ఆమెకు పిల్లలు లేకపోవడంతో అన్న బూర్ల స్వామి, వదిన పావని ఆధారంగా మిగిలారు. వారి వద్ద ఉంటున్న ఆమె పరిస్థితి తెలుసుకున్న పదోతరగతి స్నేహితులు అండగా నిలిచారు.

నియోజకవర్గం అభివృద్ధి చెందలేదు

- సీపీఎం జిల్లా కార్యదర్శి మూశం రమేశ్



మాట్లాడుతున్న మూశం రమేశ్

వేములవాడఅర్బన్: నియోజకవర్గం అభివృద్ధిలో వెనుకబడిందని సీపీఎం జిల్లా కార్యదర్శి మూశం రమేశ్ విమర్శించారు. పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో డివిజన్‌స్థాయి సమావేశం ఆదివారం నిర్వహించారు. రమేశ్ మాట్లాడుతూ బీఆర్ఎస్ పాలనలో వేములవాడ అభివృద్ధికి నోచుకోలేదన్నారు. పేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు అందించలేదన్నారు. ముంపు గ్రామాల సమస్యలు పరిష్కరించలేదన్నారు. రాజన్న ఆలయానికి ఏటా రూ.100 కోట్లు కేటాయిస్తామని చెప్పిన సీఎం కేసీఆర్ ఒక్క రూపాయి కూడా అందించలేదన్నారు. డివిజన్ కార్యదర్శి ఎర్రవెల్లి నాగరాజు, ముక్తి కాంతం అశోక్, ఏగమంటి ఎల్లారెడ్డి, విమల, ప్రశాంత్, బాబు ఉన్నారు.

గుడుంబా పట్టివేత



పట్టుకున్న బెల్లం పానకంతో పోలీసులు

వేములవాడరూరల్: వేములవాడరూరల్ మండలంలోని నూకలమర్రిలో 7 లీటర్ల గుడుంబాను పట్టుకున్నట్లు ఎస్సై మారుతి తెలిపారు. గ్రామంలోని పొలాల వద్ద గుడుంబా తయారు చేస్తున్నారన్న సమాచారంతో దాడి చేసినట్లు చెప్పారు. రాజునాయక్, మహేశ్‌నాయక్‌ల వద్ద 7 లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకుని, 45 లీటర్ల బెల్లం పానకం పారబోసినట్లు వివరించారు. గుడుంబా తయారుచేసినా, విక్రయించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

‘బెల్టు’ తీసేందుకు..



బెల్ట్‌షాపులపై దాడులు చేస్తున్న పోలీసులు

- అడుగడునా తనిఖీలు
- వదుల్లో కేసులు.. బైండోవర్లు
- పట్టుబడుతున్న లక్షల విలువైన మద్యం
- అక్రమార్కులపై నిఘా
- ఆదేశాలు పాటించాలి : ఎస్పీ అఖిల్‌మహాజన్

జిల్లాలో కేసులు ఇలా..

రౌడీషీట్స్	: 163
పీడీయాక్ట్	: 02
బెల్టుషాపుల కేసులు	: 39
బైండోవర్	: 27 మంది
నాటుసారా కేసులు	: 13
బైండోవర్	: 158

సిరిసిల్లక్రైం: ఎన్నికల కోడ్ కూయడంతో జిల్లాలో ఎక్సైజ్, పోలీస్ అధికారులు అప్రమత్తమయ్యారు. శాంతిభద్రతలకు విఘాతం కలుగకూడదనే ఉద్దేశంతో మద్యం అక్రమ విక్రయాలపై నిఘా పెట్టారు. బెల్టుషాపుల నిర్వాహకులను బైండోవర్ చేస్తున్నారు. ఎక్కడికక్కడ అక్రమ మద్యం విక్రయాలు, నాటుసారా తయారీ, విక్రయాలను అరికట్టేందుకు పకడ్బందీగా ముందుకెళ్తున్నారు. అక్రమంగా మద్యం విక్రయించేవారిని, నాటుసారా తయారీదారులను బైండోవర్ చేస్తున్నారు.

‘బెల్టు’పై దాడులు

జిల్లాలో అనధికారికంగా మద్యం విక్రయించే దుకాణాలు(బెల్టుషాపులు) లేవని ఆబ్కారీ అధికారులు ఓ యువకుడు ఆర్టీఐ కింద ఇచ్చిన దరఖాస్తుకు సమాధానం ఇచ్చారు. కానీ జిల్లాలో విచ్చలవిడిగా బెల్టుషాపులు నడుస్తున్నాయని, పోలీసులు చేస్తున్న వరుస దాడులతో తెలుస్తోంది. ఇటీవల వరుసగా జరుగుతున్న పోలీసుల దాడుల్లో లక్షల విలువైన మద్యం స్వాధీనం చేసుకుంటున్నారు. ఇన్నాళ్లు ఆబ్కారీ, పోలీసు అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించి ఇప్పుడెందుకు బెల్టుషాపులపై దాడులు చేస్తున్నారన్న విమర్శలు వైన్‌షాప్స్, బెల్టుషాపు నిర్వాహకుల నుంచి వస్తున్నాయి.

నిరంతరం తనిఖీలు



జిల్లాలో ఎన్నికల కోడ్‌ను పకడ్బందీగా అమలు చేస్తున్నాం. జిల్లా సరిహద్దుల్లో ఐదు చెక్‌పోస్టులను ఏర్పాటు చేశాం. ఇతర ప్రాంతాల నుంచి జిల్లాలోకి వచ్చి, వెళ్లే వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నాం. పరిమితికి మించి డబ్బు కలిగి ఉంటే సీజ్ చేస్తాం. అత్యవసర పరిస్థితిలో ఎక్కువ డబ్బు తీసుకెళ్తే తగిన ధ్రువీకరణ పత్రాలు ఉండాలి. అక్రమంగా నిల్వచేసి మద్యం సీజ్ చేసి కేసు నమోదు చేస్తున్నాం. పాతనేరస్తుల కదలికలపై నిఘా తీవ్రం చేశాం.
– అఖిల్ మహాజన్, ఎస్పీ

కేసులు.. బైండోవర్లు

ఇన్నాళ్లు జిల్లా అధికారులకు వైన్స్ యజమానులు మామూళ్లు ఇవ్వడంతో జిల్లాలో యథేచ్ఛగా బెల్టుషాపుల వ్యాపారం కొనసాగింది. ఎన్నికల కోడ్ అమలుతో పోలీస్, ఎక్సైజ్ అధికారులు అప్రమత్తమయ్యారు. బెల్ట్‌షాపులు, నాటుసారా తయారీ, సరఫరాదారులపై కేసులు, బైండోవర్లు పెరిగాయి. నేరచరిత్ర గల వారిని గుర్తించి ముందుగా తహసీల్దార్ల ఎదుట బైండోవర్ చేస్తున్నారు. అంతేకాకుండా అధిక మొత్తంలో డబ్బు తరలించే వారిపై నిఘా పెట్టారు. జిల్లా సరిహద్దుల్లో ఐదు చోట్ల చెక్‌పోస్టులు పెట్టి తనిఖీలు ముమ్మరం చేశారు. ఇప్పటికే జిల్లాలో 163 మందిపై రౌడీషీట్స్ తెరువగా, రెండు పీడీయాక్ట్ కేసులు నమోదై ఉన్నాయి. వీరందరిపై పోలీసులు నిఘా పెట్టి, ఎప్పటికప్పుడు వారి కదలికలను గమనిస్తున్నారు.

అనారోగ్యంతో తండ్రి మృతి

- చందాలతో అంత్యక్రియలు
- రోడ్డున పడ్డ కుటుంబం
- ఆపన్నహస్తం అందించాలని వేడుకోలు



మాచర్ల స్వామి

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): వెంటాడుతున్న పేదరికం బీడీలు చుడుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్న తల్లి.. అనారోగ్యంతో తనువు చాలించిన తండ్రి వెరసి నేడు ఆ కుటుంబం రోడ్డున పడింది. ఇంతకాలం భర్త కూలీనాలీ చేసి ఆ కుటుంబాన్ని పోషించాడు. గతేడాదిగా అనారోగ్యంతో బాధపడుతున్న కుటుంబ పెద్ద ఆదివారం మృతిచెందాడు. దీంతో భార్య, ఇద్దరు కూతుళ్లు రోడ్డున పడ్డారు. ఎల్లారెడ్డిపేట మండలం బండలింగంపల్లికి చెందిన మాచర్ల స్వామి–సుజాత దంపతులకు అశ్విత, అనిన్య కూతుళ్లు. భార్య బీడీలు చుడుతుండగా, స్వామి కూలీ పనులు చేసేవాడు. ఈక్రమంలో స్వామి ఏడాది క్రితం అనారోగ్యం బారిన పడ్డాడు. ఆర్థిక స్థోమత లేక ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యం చేయించుకున్నాడు. ఖరీదైన వైద్యం అందక రెండు రోజుల క్రితం తీవ్ర అనారోగ్యానికి గురయ్యాడు. ఇంటి వద్దనే ఉన్న స్వామి మరణించాడు. అంత్యక్రియలు నిర్వహించడానికి గ్రామస్తులు చందాలు పోగుచేసి కార్యక్రమాన్ని పూర్తి చేశారు. స్వామి మరణంతో భార్య, ఇద్దరు కూతుళ్ల అనాథలుగా దిక్కులు చూస్తున్నారు. దాతలు ముందుకొచ్చి ఆ కుటుంబానికి ఆపన్నహస్తం అందించాలని గ్రామస్తులు కోరుతున్నారు. తన భర్త మృతితో దిక్కులేని వాళ్లమయ్యామని సాయం అందించి ఆదుకోవాలని సుజాత కోరుతుంది. సాయం అందించే వారు ఫోన్‌పే 63018 38702 మాచర్ల సతీశ్‌కు ఆర్థిక సహాయం అందించాలని వేడుకుంటుంది.



అనాథలైన ఇద్దరు చిన్నారులు

మాజీ సర్పంచుల సేవలు గుర్తించాలి

- నెలకు రూ.10 వేలు పెన్షన్ ఇవ్వాలి
- మాజీ సర్పంచుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొడ్డు దేవయ్య



తంగళ్లపల్లిలో మాట్లాడుతున్న బొడ్డు దేవయ్య

తంగళ్లపల్లి(సిరిసిల్ల): గ్రామాల అభివృద్ధికి ఎంతగానో కృషిచేసి మాజీ సర్పంచుల సేవలను గుర్తించి, ప్రతి నెల రూ.10వేల పెన్షన్ ఇవ్వాలని మాజీ సర్పంచుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొడ్డు దేవయ్య కోరారు. మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. మాజీ సర్పంచులకు హెల్త్‌కార్డులు, పిల్లలకు నాణ్యమైన ఉచితవిద్య, జిల్లా కేంద్రంలో కమ్యూనిటీహాల్, ఉచిత బస్సుపాస్ సౌకర్యం, ఎమ్మెల్సీ ఎన్నికల్లో మాజీ సర్పంచులకు ఓటుహక్కు కల్పించాలని కోరారు. ఎరెడ్డి మల్లారెడ్డి, పంపునూరి మల్లేశం గౌడ్, వాణిరావు, గోపాల్, భూపతిరెడ్డి, మల్లేశం గౌడ్, రఘు, నారాయణ పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌ది ప్రజారంజక మేనిఫెస్టో

- కేసీఆర్ కార్యదక్షతకు నిదర్శనం
- టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు
- సిరిసిల్లలో ఘనంగా వేడుకలు



వేడుకల్లో కొండూరి రవీందర్‌రావు తదితరులు

సిరిసిల్లటౌన్/గంభీరావుపేట(సిరిసిల్ల): ఇప్పటి వరకు ఎవరూ ప్రకటించని విధంగా సీఎం కేసీఆర్ బీఆర్ఎస్ పార్టీ మేనిఫెస్టోను ప్రకటించారని టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ మేనిఫెస్టో విడుదల చేయడంపై పార్టీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో ఆదివారం సంబరాలు చేసుకున్నారు. రవీందర్‌రావు మాట్లాడుతూ అభివృద్ధిలో రాష్ట్రం అగ్రస్థానంలో ఉండడం కేసీఆర్ కార్యదక్షతకు నిదర్శనమన్నారు. సౌభాగ్యలక్ష్మి, రూ.400కే సిలిండర్ తదితర పథకాలు పేదలకు, మహిళలకు ప్రాధాన్యతనిస్తూ మేనిఫెస్టో రూపొందించినట్లు పేర్కొన్నారు. టీఎస్‌పీటీడీసీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చీటి నర్సింగారావు, జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, జిల్లా గ్రంథాలయసంస్థ చైర్మన్ ఆకునూరి శంకరయ్య, ఆర్‌బీఎస్ అధ్యక్షుడు గడ్డం నర్సయ్య, పార్టీ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి, మున్సిపల్ వైస్‌చైర్మన్ మంచె శ్రీనివాస్, సుంకపాక మనోజ్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రజా ఆశీర్వాద సభను విజయవంతం చేయండి

జిల్లా కేంద్రంలో ఈనెల 17న నిర్వహించే ప్రజా ఆశీర్వాద సభను విజయవంతం చేయాలని టెస్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు కోరారు. గంభీరావుపేట మండలం గజసింగవరంలో ఆదివారం గ్రామస్తులతో సమావేశమయ్యారు. సీఎం కేసీఆర్ ఆశీర్వాద సభకు తరలిరావాలని కోరారు. సర్పంచ్ బాలరాజు, జెడ్పీటీసీ కొమిరిశెట్టి విజయ, ఏఎంసీ మాజీ చైర్‌పర్సన్ సంపూర్ణ, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ నాయకులు



కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న బాల్‌రాజ్‌యాదవ్, ఇతర నాయకులు

- టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సమక్షంలో చేరిక

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మేజర్ గ్రామపంచాయతీ ఉపసర్పంచ్ ఒగ్గు రజిత భర్త మాజీ ఎంపీటీసీ, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఒగ్గు బాల్‌రాజ్‌యాదవ్, గంభీరావుపేట మండలం గోరింటాలకు చెందిన మాజీ సర్పంచ్, మున్నూరు కాపు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు తిరుపతి ఆదివారం బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరారు. హైదరాబాద్‌లో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. కొంతకాలంగా బాల్‌రాజ్‌యాదవ్, తిరుపతిలను బీఆర్ఎస్ అధిష్ఠానం పట్టించుకోకపోవడం, పార్టీలో సముచిత స్థానం కల్పించకపోవడంతో ఈమేరకు నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. ఎల్లారెడ్డిపేట మేజర్ గ్రామపంచాయతీ ఉపసర్పంచ్ రజిత భర్త కాంగ్రెస్‌లో చేరగా ఆమె తటస్థంగా ఉండడం విశేషం. సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి ఉన్నారు.

బీఆర్ఎస్ టు కాంగ్రెస్

సిరిసిల్లటౌన్: అధికార బీఆర్ఎస్ పార్టీ నుంచి పలువురు పద్మశాలి నేతలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆదివారం కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో సిరిసిల్ల పట్టణ పద్మశాలి సంఘం అధ్యక్షుడు గోలి వెంకటరమణ పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. అర్బన్‌బ్యాంకు డైరెక్టర్ స్వర్గం రాజు, బీఆర్ఎస్ పట్టణ నాయకులు దుబాల వెంకటేశం, ధ్యావనపల్లి వెంకటేశం, వెల్ది రమేశ్ తోపాటు బీజేపీ నాయకుడు అల్లె బాలరాజు, వీర్నపల్లి టీడీపీ మండలాధ్యక్షుడు పరుమాల మల్లేశం చేరారు. కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు చొప్పదండి ప్రకాశ్, మాజీ కౌన్సిలర్ యెల్లె లక్ష్మీనారాయణ, వైద్య శివప్రసాద్, కాముని నళినికాంత్ ఉన్నారు.

ప్రవళికది ప్రభుత్వ హత్యే..

- డీవైఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు మహేశ్

ముస్తాబాద్(సిరిసిల్ల): గ్రూప్ పరీక్షలు నిర్వహించలేని అసమర్థ ప్రభుత్వ వైఖరితోనే ప్రవళిక ఆత్మహత్య చేసుకుందని.. ఇది ముమ్మాటికీ ప్రభుత్వ హత్యేనని డీవైఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు గాంతుల మహేశ్ పేర్కొన్నారు. ముస్తాబాద్‌లో మహేశ్ ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ పోటీ పరీక్షల కోసం అప్పులు చేసి నెలల తరబడి కోచింగ్ సెంటర్లకు వెళ్లి కష్టపడ్డ ప్రవళిక గ్రూప్ పరీక్షలను రద్దు చేయడంతో విధిలేని పరిస్థితుల్లో ఆత్మహత్య చేసుకుందన్నారు. ఎంతో భవిష్యత్ ఉన్న ప్రవళిక అర్ధంతరంగా తనువు చాలించడం వెనుక ప్రభుత్వ అసమర్థ పాలనే కారణమన్నారు. ప్రవళిక లాంటి ఘటనలు పునరావృతం కాకుండా రాబోవు ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు తగిన గుణపాఠం చెప్పాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో సర్పంచ్ భర్తకు గాయాలు



తిమ్మాపూర్: కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలోని అలుగునూర్– వరంగల్ జాతీయ రహదారిపై ఆదివారం రోడ్డు ప్రమాదం జరిగింది. ఎస్సై ప్రమోద్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం మానకొండూరు మండలం గంగిపల్లి సర్పంచ్ భర్త సాగర్ తన కారులో కరీంనగర్ వెళ్తుండగా ఎదురుగా వచ్చిన లారీ ఢీకొనడంతో సాగర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. 108 వాహనంలో కరీంనగర్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు నమోదు చేసుకున్నారు.

కేటీఆర్‌తోనే సిరిసిల్ల అభివృద్ధి

- పద్మశాలీలు ‘లక్ష’ణంగా గెలిపిస్తారు
- పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షుడు బాలయ్య



మాట్లాడుతున్న గాజుల బాలయ్య

సిరిసిల్లటౌన్: సిరిసిల్ల ప్రాంత అభివృద్ధి మంత్రి కేటీఆర్‌తోనే సాధ్యమని పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షుడు గాజుల బాలయ్య పేర్కొన్నారు. గతంలో తాను అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజారాజ్యం నుంచి పోటీ చేసి ఓడిపోవడమే మంచిదైందన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. కేటీఆర్ గెలుపుతోనే సిరిసిల్ల నియోజకవర్గం సమగ్రాభివృద్ధి సాధిస్తుందన్నారు. వస్త్రపరిశ్రమ, జిల్లా అభివృద్ధి ప్రదాత కేటీఆర్‌ను పద్మశాలి బాంధవులు లక్ష మెజార్టీతో గెలిపిస్తారన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి దిడ్డి రాజు, కోశాధికారి గడ్డం విఠల్, రిక్కుమల్ల సంపత్ తదితరులు పాల్గొన్నారు.

పద్మశాలి యూత్ విభాగం..

అసెంబ్లీ ఎన్నికల్లో సిరిసిల్ల నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా మంత్రి కేటీఆర్‌కు పద్మశాలి యువజన సంఘం అధ్యక్షుడు గుండ్లపెల్లి పూర్ణచందర్ మద్దతు ప్రకటించారు. ఈమేరకు ఏకగ్రీవ తీర్మానం చేసినట్లు తెలిపారు. ప్రధాన కార్యదర్శి గెంట్యాల శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు ఒగ్గు వేణు, వేముల ప్రకాశ్ పాల్గొన్నారు.

రాముని సేవలో ప్రధాన న్యాయమూర్తులు



గంభీరావుపేట(సిరిసిల్ల): మండల కేంద్రంలోని శ్రీసీతారామస్వామి వారిని రాజన్నసిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి జిల్లాల ప్రధాన న్యాయమూర్తులు ప్రేమలత, ప్రతిమ, హేమంత్‌కుమార్ ఆదివారం దర్శించుకున్నారు. ఆలయంలో నిత్యం వెలిగే నందదీపం, మూల విగ్రహాలను సందర్శించారు. ఆలయ విశిష్టత గురించి ఆలయ కమిటీ చైర్మన్ మల్లుగారి నర్సాగౌడ్ వివరించారు.

ఆశీర్వాద సభకు తరలిరావాలి



ముస్తాబాద్‌లో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు



ముస్తఫానగర్‌లో ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు



తంగళ్లపల్లిలో బొట్టుపెట్టి ఆహ్వానిస్తున్న ఎంపీపీ మానస

తంగళ్లపల్లి/ముస్తాబాద్/గంభీరావుపేట(సిరిసిల్ల): జిల్లా కేంద్రంలో ఈనెల 17న నిర్వహించే సీఎం కేసీఆర్ ఆశీర్వాద సభకు భారీగా తరలిరావాలని కోరుతూ బీఆర్ఎస్ నాయకులు జిల్లాలో ఆదివారం విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. ఇంటింటికీ వెళ్లి బొట్టుపెట్టి సభకు రావాలని పిలుస్తున్నారు. తంగళ్లపల్లిలో ఎంపీపీ పడిగెల మానస ఇంటింటికి వెళ్లి మహిళలకు బొట్టుపెట్టి ఆహ్వానించారు. ముస్తాబాద్ బీఆర్ఎస్ ఆఫీస్‌లో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆ పార్టీ పట్టణాధ్యక్షుడు ఎద్దండి నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. సీఎం బహిరంగ సభకు భారీ ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. గంభీరావుపేట మండలం ముస్తఫానగర్‌లో బీఆర్ఎస్ నాయకులు నర్సింగారావు, బండ రమేశ్, శివంది దేవేందర్ ఇంటింటికి వెళ్లి సభకు రావాలని కోరారు. నాయకులు అంకారపు అనిత, వలకొండ వేణుగోపాల్‌రావు, పెద్దూరి తిరుపతి, మట్ట రాజిరెడ్డి, సంతోష్‌రావు, ముత్యాల దేవేందర్, చెవుల మల్లేశ్, మనోహర్, స్వామి, కోడె శ్రీను పాల్గొన్నారు.